# వెలుగు

పేషంట్లందరూ వెళ్ళిపోయేరు. పది నిమిషాలతర్వాత కంపౌండరు శ్రీరాములు కూడా వెళ్ళిపోయేడు. టైము చూశాను. ఎనిమిది గంటలు దాటుతోంది.

రోజూ నేను ఆ సమయానికి గుడిలో వుంటాను. కాని— ఈరోజు పేషెంట్లు ఎక్కువమంది రావటంవల్ల ఆలస్యమయింది. ముందు గదికి తాళంపెట్టి బయటకు వచ్చాను.

అమావాస్య రోజులు. రోడ్లు చీకటిగా వున్నాయి. అలవాటయిన దారికనుక నేను ఇబ్బంది ఫీలవలేదు.

చెరువు కట్టమీది ఆంజనేయస్వామి గుడిలో జరుగుతున్న భజన రానురాను పెద్దదిగా వినిపిస్తోంది. ఎవరో ఆయన- ఎవరో ఎందుకయిందే? బత్తుడు కీర్తన పాడుతున్నాడు. మిగిలిన వారందరూ అంటున్నారు.

నడివీధి మర్రిచెట్టు కిందకు వచ్చేసరికి రోడ్డు చివరనున్న గుడి-గుడిముందు తగిలించిన పెట్రోమాక్సు లైటు కనిపించాయి. రోడ్డుమీదకు పడుతోంది వెలుతురు. వెలుతురు మధ్య పొడుగ్గా సాగిన ధ్వజస్తంభం నీడ.

గుడి పక్కనుంచి చెరువు దగ్గరకు వెళ్ళాను. నిశ్చలంగా వున్నాయి నీళ్ళు. దిగి కాళ్ళు కడుక్కున్నాను. నిశ్శబ్దాన్ని భంగ పరిచినందుకు విసుక్కున్న నీళ్ళ చప్పుడు.

కట్టమీదకు ఎక్కేసరికి టెంకాయ, అగరవత్తులతో గుడికి వెడు తున్న శేషయ్యశెట్టి భార్య- కూతురు కనిపించారు.

"ఎవరూ? డాక్టరుగారేనా?" అన్నదామె నడుస్తూనే.

"అవును" అంటూ వారిని కలిశాను. శెట్టి కూతురు తల్లోవున్న జాజిపూల వాసన మత్తుగా వీచింది.

ముగ్గురం గుళ్ళోకి వెళ్ళాము. అప్పటికే చాలామంది వచ్చారు. శెట్టి భార్య- కూతురు లోపలకు వెళ్ళి దణ్ణం పెట్టుకుని బయటకు వచ్చారు.

"రండి డాక్టరుగారూ" అని పిల్చి చోటు చూపించాడు సుందర మూర్తిగారు. ఆయన ఆ వూరి ఎలిమెంటరీ స్కూలు మాస్టర్. ఆయన పక్కనే కూర్చున్నాను.

బత్తుడు కీర్తన ఆపాడు. మరో కీర్తన పాడటానికి ముందు విరామ సమయం అది. తర్వాత వెంకటేశ్వరశాస్త్రిగారు గొంతు సవరించుకున్నారు.

తాళాలు మోగుతున్నాయి. గుళ్ళో పూజ జరుగుతోంది. దేవుడి ముందు వెలిగించిన అగరవత్తుల పరిమళం బద్ధకంగా బయటకు వస్తోంది.

ఒక వైపు మగవాళ్ళు- మరోవైపు ఆడవాళ్ళు....

అలాంటి వాతావరణం నాకెంతో ఇష్టమయింది.

అందుకోసమే పట్నంలోవున్న ప్రాక్టీసును కూడా వదులుకుని పల్లెటూరికి వచ్చాను.

కొంతమంది అమ్మాయిలు చిన్నగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వు కుంటున్నారు. చిన్నపిల్లలు రాలిన రావి ఆకులను పీకలు చేసి వూదు కుంటున్నారు.

నా కళ్ళు కస్తూరి కోసం చూస్తున్నాయి. ఎక్కడా కనిపించ లేదు. కస్తూరి లేనిలోటు స్పష్టంగా కనిపిస్తూనే వుంది. ఆ రోజే కాదు. గత నాలుగు రోజులుగా కస్తూరి గుడికి రావటంలేదు. ఎందు వల్ల రావటం లేదో?

కస్తూరి- సుందరమూర్తి మేస్టారి కూతురు. వయసు ఇరవైలోపు వుంటుంది. అందమైనది. అన్నిటికంటే ఆమె గొంతు చాలా బావుం టుంది. ఆ అమ్మాయికి చాలా పాటలువచ్చు. మధురంగా పాడుతుంది.

"చందన చర్చిత నీల కళేబర" పాటను అద్భుతంగా పాడు తుంది కస్తూరి.

మొదటిసారిగా నేను ఆ గుడికి వెళ్ళినపుడు కస్తూరి పాడగావిన్న మొదటి పాట అదే. ఆ మనిషి- ఆ గొంతు- ఆ పాట నాలో చెరగని ముద్రవేశాయి. కస్తూరి పాటలకోసమే నేను రోజూ గుడికి వెళ్ళేవాడిని.

కాని- కస్తూరి నాలుగు రోజుల్నించి రావటంలేదు. పక్కనే కూర్చున్న మేస్టారిని అడుగుదామనుకున్నాను కాని ఆయన ఏమను కుంటాడోనని అడగలేదు.

భజన పూర్తయ్యేసరికి పావుతక్కువ పది గంటలయింది. ఆ రోజు శనివారం కావటంవల్ల ఎవరో ఆకుపూజ చేశారు.

పానకం తాగి- ప్రసాదం తీసుకుని మేస్టారితో కలిసి బయటకు వచ్చాను. మర్రిచెట్టు వరకు వచ్చిన తర్వాత ఆయన చీలిపోయేరు.

"ఇంటికి రారా మీరు?" అడిగాను.

"లేదు. రామదాసు గారింటికి వెడుతున్నాను.... ఇప్పుడే నిద్ర పట్టదుగా" అని వెళ్ళిపోయేరు.

వెళ్ళి తాళంతీసి గది తలుపు తెరిచేసరికి లోపల చీకటిగావుంది.

కిటికీ తలుపులు మూయటం మరిచానేమో- దీపం ఆరిపోయింది. వెలిగించాను.

గదినిండా కాంతి.

ముందు డిస్పెన్సరీ. వెనక నా కాపురం. రెండు గదుల డాబా యిల్లు. ఆ పల్లెటూళ్ళో అలాంటి ఇల్లు దొరకడం నిజంగా నాఅదృష్టం.

పక్క వేసికొని పడుకున్నాను. శనివారం రాత్రిపూట భోజనం చెయ్యను.

నా కళ్ళముందు కస్తూరి. కస్తూరి కేమయింది? ఎందువల్ల గుడికి రావటంలేదు? ఒంట్లో బావుండలేదా? అలాఐతే మేస్టారు నా దగ్గర మందు తీసికెళ్ళేవాడే. ఆ వూళ్ళో ఇంగ్లీషు వైద్యంచేసే మరో డాక్టరు లేడు. కస్తూరి గురించి ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకోబోయేను.

ఇంతలో బయట ఎవరో తలుపుతట్టిన చప్పుడు వినిపించింది. కళ్ళు విప్పాను.

"డాక్టరుగారూ" ఎవరో పిలుస్తున్నారు చిన్నగా. అలా రాత్రి పూటవచ్చి నన్ను లేపటం కొత్తగాదు. డాక్టర్లందరికీ ఇది సహజమే.

లేచి తలుపు తెరిచాను.

ఎదురుగా ఓ ఆడమనిషి. నా మీదినించి బయటపడిన కాంతిలో గుర్తించాను. చెప్పలేని ఆశ్చర్యం.

కస్తూరి!

"మీరా?" ఆశ్చర్యంగా అన్నాను.

"నన్ను లోపలకు రానియ్యండి" అన్నది చిన్నగా.

అడ్డు తప్పుకున్నాను. లోపలకువచ్చి తలుపులను మూసింది. కస్తూరి ప్రవర్తన నాకు అర్థమవలేదు.

"కూర్చోండి" అన్నాను. కుర్చీలో చివరగా కూర్చుంది. నిమిషం తర్వాత "ఒంట్లో బావుండలేదా?" అడిగాను.

"అవును"

"జ్వరమా?"

"కాదు."

"మరి ఎలా వుంది?"

కస్తూరి మాట్లాడలేదు.

"పరీక్ష చేస్తాను-" లేవబోయేను.

"వద్దు కూర్చోండి....పరీక్ష చేయనవసరంలేదు. నాకేమయిందో నాకు తెలుసు"

"ఏమయింది? చెప్పండి?"

తలవంచుకుంది. చెప్పలేదు. కన్నీటి బొట్లు ఒళ్ళో పడ్డాయి. ఏడుస్తోంది.

"ఏడుస్తున్నారా? ప్లీజ్.... చెప్పండి. మీకేమయింది? నాకు చేతనైన సాయం చేస్తాను" అనునయంగా అడిగాను.

"నెల తప్పింది."

అదిరిపడ్డాను. కస్తూరికి నెల తప్పిందా? కళ్ళు తిరిగినట్లనిపించింది. ఎందుకిలా జరిగింది. ఇందుక్కారణం ఎవరు? ఐదు నిమిషాల తర్వాత తేరుకోగలిగాను.

"అధైర్య పడకండి.... వివరంగా చెప్పండి. నన్నేం చేయమంటారు?"

"ఎబార్షన్ చేయండి"

"ఎబార్షనా?"

"అవును. ఆ నీచుడు కూడా అదే చేయించుకో మన్నాడు?"

"ఎవరా నీచుడు?"

"శ్రీపతి"

"కరణంగారి అబ్బాయా?"

తలవూపింది కన్నీటిని తుడుచుకుంటూ కస్తూరి.

"ఇంత సులభంగా మీరెలా మోసపోయేరు?"

"మోసమని ఇప్పుడు తెలిసింది.... ఇద్దరం ప్రేమించుకున్నాము. మా ఇంటివెనక రోజూ కలుసుకుంటున్నాము. ఎన్నో తీయని కబుర్లు చెప్పాడు. నిజమే అనుకున్నాను. ఫలితం....ఇప్పుడు అనుభవిస్తున్నాను. నెలతప్పిందని తెలిసిన తర్వాత నన్ను కలుసుకోవటం మానేశాడు. ఆ రోజే నన్ను పెళ్ళి చేసుకోమని అడిగాను. నేనంటే తనకు ప్రేమేగాని పెళ్ళి చేసుకోడట.... వాళ్ళ అత్తయ్య కూతురు వుందిట. నన్ను చేసుకోనన్నాడు. చివరికి పట్నం రమ్మని ఎబార్షన్ చేయిస్తాననీ అన్నాడు" మెల్లగా చెప్పింది కస్తూరి.

కస్తూరికి ఎబార్షన్ చేయ్యడం నాకు ఇష్టం లేదు.

శ్రీపతితో మాట్లాడి ఎలాగైనా అతడిని పెళ్ళికి ఒప్పించాలనుకున్నాను....

"మీరే నన్ను ఆదుకోవాలి...." దీనంగా అన్నది కస్తూరి....

ఆమె జాలి ముఖం నన్ను కలవరపరిచింది. కస్తూరికి తల్లిలేదు. చిన్నప్పుడే పోయిందట.

నేనెంతగానో అభిమానించే కస్తూరి ఇంత విషాదంలో మునిగి వుందా? ఇందుకా కస్తూరి గుడికి రాకుండా ఆగిపోయింది?

"సారీ.... ఎబార్షన్‌గురించి ఇప్పుడు ఎలాంటి మాటా ఇవ్వలేను. మన ప్రయత్నం మనం చెయ్యాలి. నేను రేపు శ్రీపతితో మాట్లాడ

తాను. ఎలాగైనా అతడ్ని ఒప్పించగలనన్న నమ్మకం నాకుంది. మీకు ఏ విషయం రేపు రాత్రికి చెబుతాను" అన్నాను.

"శ్రీపతితో మాట్లాడతారా? వద్దు డాక్టరుగారూ- అతను ఒప్పుకోడు.... మూర్ఖుడు" అన్నది కస్తూరి.

"కావచ్చు.... ఐనా ప్రయత్నిస్తాను- మీరు రేపు రండి"

నీరసంగా లేచి నిల్చుంది కస్తూరి.

"దయవుంచి ఎలాంటి అఘాయిత్యానికి తలపడకండి" అన్నాను.

నిర్జీవంగా నవ్వి "అలాంటి ఉద్దేశమే వుంటే మీ దగ్గరకు వచ్చేదాన్ని కాదు డాక్టరుగారూ.... నేనంత పిరికిదాన్ని కాదు. నాకు బతుకు మీద తీపి ఎక్కువ" అని వెళ్ళిపోయింది.

తలుపులు మూశాను. పక్కమీద వాలాను. మనసంతా అదోలా ఐపోయింది. ఎంతపని చేశాడు శ్రీపతి? కస్తూరికి ఎంతటి అన్యాయం జరిగింది? ఎలాగైనా శ్రీపతిని ఒప్పించాలి.... అనుకుంటూనే నిద్రలోకి జారిపోయేను.

* * * *

మర్నాడు గుడికి వెళ్ళలేదు. కస్తూరికోసం ఎదురు చూస్తూ ఇంట్లోనే వున్నాను. తొమ్మిది గంటలు కావస్తోంది. ఆకలిగా వున్నా భోజనం చెయ్యాలనిపించలేదు.

కస్తూరి వూహ ముమ్మాటికీ నిజమే. శ్రీపతి కస్తూరిని చేసుకోటానికి ఒప్పుకోలేదు. పైగా తనకీ- కస్తూరికీ ఏదో సంబంధమున్నట్లు మాట్లాడాడు. కస్తూరి మంచిది కాదన్నాడు. అన్నీ అర్థంలేని మాటలని నాకు తెలుసు. తను చేసిన తప్పును కప్పిపుచ్చుకోటానికి ప్రతి మనిషీ ఇలాగే మాట్లాడతాడు.

''ఇప్పుడు కస్తూరి గతేమిటి?'' శ్రీపతిని అడిగాను. ''ఎబార్షన్ చెయ్యండి- ఖర్చు నేను భరిస్తాను''

"అంతేగానీ.... పెళ్ళికి ఒప్పుకోనంటావు''

"మొదట్నుంచీ కస్తూరిని చేసుకునే ఉద్దేశం నాలోలేదు''

"అలాంటి వాడివి ఆమె జీవితంలో ఎందుకు చెలగాటం ఆడావు?''

"ప్రేమకు, కామానికి సంబంధం లేదు. కస్తూరి ఇష్టం మీదనే అలా జరిగింది".

"కస్తూరి నిన్ను ప్రేమించింది.... నమ్మింది. అందుకే ఇష్ట పడింది".

"ఏమో అవేమీ నాకు తెలీదు" మొండిగా అన్నాడు.

అతను చదువుకున్నవాడే....ఐతేనేం? మూర్ఖుడు. ఇక అతనితో మాట్లాడి ప్రయోజనం లేదనిపించింది. అందుకే వచ్చేశాను.

తొమ్మిదీ పదికి కస్తూరి లోపలకు వచ్చింది- తలుపులను మూసింది.

నాముఖం చూడటంతోనే ఏం జరిగి వుంటుందో గ్రహించిందను కుంటాను. ఓ ఐదు నిముషాల తర్వాత "శ్రీపతి ఒప్పుకోడని నాకు తెలుసు" అన్నది.

"సారీ. మీకు ఎబార్షన్ చెయ్యలేను. మిమ్మల్ని పెళ్ళి చేసు కుంటాను. ...శ్రీపతి మీకు చేసిన అన్యాయం గురించి మరిచిపొండి. అదంతా జరగలేదనుకోండి".

విస్తుబోయింది కస్తూరి. నానుంచి ఎదురు చూడని మాటలు- ఆమె నోట మాటరాలేదు. ఏమనాలో అర్థంకాలేదు.

కస్తూరి మీద అసహ్యం ఎంత మాత్రమూ లేదు. కొంత జాలి తప్ప. ఒకరకంగా కస్తూరంటే నాకు ప్రేమ- అభిమానం- ఆరాధనా...

"మాట్లాడండి కస్తూరీ.... నన్ను చేసుకోవటం మీకు ఇష్టమేనా? ఇష్టమున్నా లేకపోయినా మీరంటే నాకు ఇష్టం. మిమ్మల్ని నేను ప్రేమించాను. మీ పాటకోసం- మీకోసం రోజూ గుడికి వస్తున్నాను. మీరు శ్రీపతిని ప్రేమించారని నాకు తెలిదు. ఏదో ఒకరోజు నేను నా ప్రేమను బయట పెట్టేవాడినే. డాక్టరుగా మీకు ఎబార్షన్ చెయ్యలేను. మనసున్న మనిషిగా మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను".

కస్తూరి మాట్లాడలేదు. కొన్ని క్షణాల తర్వాత "నన్ను ఆలోచించుకోనివ్వండి" అని వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిపోయిన కస్తూరి ఆ మరురోజు నా దగ్గరకు రాలేదు. ఆమె నిర్ణయం కోసం ఎదురు చూస్తున్న నాకు ఆరోజు రాత్రి శ్రీపతికి కస్తూరితో పెళ్ళి జరగబోతుందనే వార్త కరణంగారి ద్వారా తెలిసింది. నమ్మలేదు. కానీ నిజమే-

క్రితం రోజు రాత్రి నేను- కస్తూరి మాట్లాడుకుంటున్న సమయంలో కరణంగారు తనకు ఒంట్లో బాగాలేదని మందుకోసం నా డిస్పెన్సరీకి వచ్చారుట. బయట తలుపుదగ్గర నిల్చుని మా సంభాషణ విన్నారుట. తన కొడుకు చేసిన ఘోరం ఆయనకు తెలిసిపోయింది. వెంటనే వెళ్ళి శ్రీపతిని తిట్లు తిట్టి కస్తూరిని చేసుకోమన్నారుట. తండ్రి దగ్గర శ్రీపతి పిల్లి. ఐతే ఈ విషయం ఆయన ఎవ్వరికీ చెప్పలేదు.

నాకెంతో సంతోషమనిపించింది. బాధతో మనసు కలుక్కుమన్నా- కస్తూరి బతుకు కుదుటపడింది. కరణంగారు మంచివారు కాబట్టి సరిపోయింది. లేకపోతే?

పది రోజులకే కస్తూరి పెళ్ళి జరిగింది. వెళ్ళాను. వీలుచూసుకుని ఎవరూ చూడకుండా కస్తూరితో అన్నాను "మీ ధైర్యం- గుండె

నిబ్బరమే మీ జీవితాన్ని వెలుగు మయంచేశాయి కస్తూరీ. త్వరపడి పిరికితనంలో ఏ అఘాయిత్యమో చేసివుంటే?"

మాట్లాడలేదు. కృతజ్ఞత రంగరించిన చూపును నామీదికి మరల్చింది.

"ఈ సంతోష సమయంలో నా కోరిక తీరుస్తావా?"

"ఏమిటి?" కుతూహలంగా అడిగింది.

"మీరు చందన చర్చిత పాట పాడాలి"

"ఇప్పుడు కాదు... రాత్రికి గుళ్లో దేవుడి ముందు."

రాత్రికోసం ఎదురుచూస్తూ అసహనంగా గడిపాను. త్వరత్వరగా పేషెంట్లందరినీ పంపి తాళంపెట్టి బయటపడేసరికి ఎనిమిది గంటలు కావస్తోంది. గబగబా గుడివైపు నడిచాను. అప్పటికే గుడినిండా మనుషులు.

"డాక్టరుగారు వచ్చారు" ఎవరో అన్నారు.

"రండిడాక్టరుగారూ...." సుందరమూర్తి మేస్టారి ఆహ్వానం.

ఆడవాళ్ళవైపు చూశాను.

పాట పాడమని అమ్మాయిలందరూ కస్తూరిని బలవంతపెడుతున్నారు.

నన్ను చూసింది కస్తూరి.

గొంతు విప్పింది.

చెరువు నీటిమీదనించి వీస్తున్న చల్లగాలి - గాలికి కదులుతున్న రావిచెట్టు ఆకుల గలగల- గర్భగుడినించి వుండుండి బయటకు వస్తున్న అగరవత్తుల పరిమళం - వీటన్నింటి మధ్య కస్తూరి పాట నన్ను ఏవో లోకాలకు తీసుకెళుతున్నాయి.

"చందన చర్చిత నీలకళేబర పీతవసన వనమాలీ" శ్రావ్యంగా పాడుతోంది కస్తూరి.

మై మరచిపోయేను.

ఆ పాటలో- ఆ గొంతులో నాకేదో భావన స్ఫురిస్తోంది'. కనీసం వచ్చే జన్మలోనైనా మీ కోరిక తీరుస్తాను డాక్టరుగారూ' అనే కస్తూరి వాగ్దానం.

*

(8-12-77 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక)